క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు అందజేత



మాచర్ల : మదర్ థెరిస్సా సేవాసమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, పలకలు అందించారు. శుక్రవారం వీరభద్రాపురం నెహ్రూనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి కాంతారావు మాట్లాడుతూ సమితి సేవా కార్యక్రమాలను కొనియాడారు. పేద విద్యార్థులకు పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. వేళంగిని కీర్తి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేత యనముల కేశవరెడ్డి, సేవాసమితి సభ్యులు శిరీష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరాస్వామి యాదవ్, ఆవుల వెంకటేశ్వర్లు, మర్రెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, ఎ.చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో తనిఖీలు



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని పలు రవాణా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిషేధిత ఎరువులు, పురుగు మందులు అక్రమంగా రవాణా జరుగుతున్నాయా.. లేదా.. అనే కోణంలో ఏవో దొండేటి పాపకుమారి తనిఖీ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల నిర్వహణకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అక్రమంగా పురుగు మందులు, ఎరువులు రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో పాపకుమారి చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వెల్దుర్తి: మండలంలోని గుడిపాడు చెరువులో మాతా అమృతానందమయి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నజీరుద్దీన్, థెరిస్సాలతో పాటు బెల్జియన్స్ టు జమీబియాకు చెందిన పీహెచ్‌డీ విద్యార్థులు కెభా, కెమో, జోనాలు 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు మాట్లాడుతూ గూడెంలో ఉండే వారు అందరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. ఉతికిన దుస్తులను ధరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనానికి ముందు, తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఇళ్ల ముందు చెత్తా, చెదారం లేకుండా.. కాలువలలో మురుగును ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అమృతానందమయి సంస్థ కో ఆర్డినేటర్ మల్లిఖార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల ఉచిత వైద్య శిబిరం



పిడుగురాళ్ల: మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ఎంపీపీ స్కూల్ (మెయిన్)లో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో స్నేహ పిల్లల హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకాంత్ సుమారు 220 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుండా అశోక్‌బాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, ట్రెజరర్ గుర్రం కృష్ణకాంత్, హెల్త్ ప్రోగ్రామ్ కన్వీనర్ ఆత్మకూరి గురవయ్య, పాఠశాల హెచ్‌ఎం గాదేపల్లి గాయత్రి పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

పెదకూరపాడు: పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి అత్తోటి మురళీ ముకుంద్ నోట్ పుస్తకాలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలతోపాటు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న మురళీ సేవలను అభినందించారు. ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట సాగులో విత్తనశుద్ధి ఎంతో అవసరం

మాచవరం: పంటల సాగులో విత్తనశుద్ధి ఎంతో ఆవశ్యకమని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని వేమవరం రైతు సమాచార కేంద్రంలో వరి పంటలో విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంట సాగుకు ముందు విత్తనశుద్ధి చేపడితే తెగుళ్లు, చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చని తెలిపారు. గ్రామంలో పత్తి పంట క్షేత్రాన్ని సందర్శించి చీడపీడల నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. ప్రస్తుతం పత్తిలో రసం పీల్చు పురుగు, పచ్చదోమ నివారణకు దయామిథాక్సమ్ 2 గ్రాములు లేదా పిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి పంటలో ఆవుపేడ, ఆవు మూత్రం, పుట్టమట్టి, సున్నంతో విత్తనశుద్ధి విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కె.రామమ్మ, ప్రకృతి వ్యవసాయ మండల కో ఆర్డినేటర్ సునీల్, ఇన్‌చార్జి సర్పంచ్ పెరుగు రోశయ్య, గ్రామ పెద్దలు కొలగాని శివ, వీఏఏ వంశీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో బహుళ ప్రయోజనాలు

రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన అధిక దిగుబడులను సాధించడంతో పాటు బహుళ ప్రయోజనాలను పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న వరి విత్తనాలను పోయగా నీటిపైన తేలిన తాలు విత్తనాలను తీసివేసి నీటి అడుగున ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవడానికి వాడుకోవాలన్నారు. కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటలు నానబెట్టిన అనంతరం మరో 20 నుంచి 24 గంటల పాటు మంచి నీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లుకోవాలన్నారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లేముందు 0.2 శాతం క్లోరిప్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లుకోవాలన్నారు. కార్బనిజంతో కలిపి విత్తన శుద్ధి చేసుకోవచ్చన్నారు. విత్తన శుద్ధి చేసి సాగు చేస్తున్న పంటలను చీడ, పీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. పత్తి చుట్టూ అంతర పంటగా 4 సాళ్లకు ఒక సాలుకు కంది, మినప, పెసర పంటలను సాగు చేసు కోవచ్చన్నారు. మాగాణి చుట్టూ గట్టుపై కంది పంటను రైతులు అంతర పంటగా సాగుచేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ కూడా అంతర పంటలను సాగుచేసే రైతులను ప్రోత్సహిస్తుందన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు



రైతులకు వరి విత్తనశుద్ధి విధానాన్ని తెలియజేస్తున్న వ్యవసాయాధికారులు

మాచవరంలో డయేరియా కలకలం

- పలువురికి వాంతులు, విరేచనాలు
- చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు

మాచవరం: మాచవరంలో డయేరియా కలకలం రేపుతుంది. గత రెండు రోజులుగా పలువురు వ్యాధి బారినపడి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన కోటా పద్మ గత సోమవారం వాంతులు, విరేచనాలతో బాధపడుతూ మాచవరం పీహెచ్‌సీలో చేరింది. మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేయగా, అత్యవసర నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చినప్పటికి పరిస్థితి తీవ్రంగానే ఉంది. అలాగే గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన అత్తలూరి ఏసు, అత్తలూరి నరసింహారావులు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. అదే గ్రామానికి చెందిన గంటా వెంకటనర్సమ్మ నరసరావుపేటలోని అంజిరెడ్డి హాస్పిటల్‌లో, మరో మహిళ షేక్ రంజాన్‌బి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పలువురు వ్యాధి బారిన పడడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రాణ నష్టం జరగక ముందే తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు. పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని, మంచి నీటి పరీక్షలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న నరసింహారావు



కోటా పద్మ



అత్తలూరి ఏసు

దాచేపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్



దగ్ధమైన ఎయిర్ కండిషనర్



కాలిపోయిన టీవీని చూపిస్తున్న బాధితురాలు

పలువురి ఇళ్లలో దగ్ధమైన గృహోపకరణాలు

దాచేపల్లి : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణలు దగ్ధమైన ఘటన నగర పంచాయతీ పరిధిలో శుక్రవారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని జలగల బజార్, మసీద్ బజార్‌లో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావటంతో పలువురి ఇళ్లలోని గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. బుగ్గల జానీ నివాసంలో ఎయిర్ కండిషనర్ పూర్తిగా కాలిపోయి మంటలు వ్యాపించాయి. ఇంట్లోని ఫ్రిజ్, కూలర్లు కూడా దగ్ధమయ్యాయి. షేక్ జానీబాషా ఇంట్లో కూడా గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా హై వోల్టేజి సరఫరా కావటంతో పలువురి ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, కూలర్లు కాలిపోయాయి. బాధితులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించటంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా నిలిపివేశారు. ఏఈ భగవాన్ నాయక్ ఘటన స్థలాన్ని పరిశీలించి హై వోల్టేజి రావటానికి గల కారణాలపై ఆరా తీశారు. మరమ్మతుల అనంతరం విద్యుత్ సరఫరా పునఃరుద్ధరించారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు చెప్పారు.

ఆధార్ శిబిరాలకు 'సర్వర్' పాట్లు

సత్తెనపల్లి: ఆధార్ వివరాల మార్పుచేర్పులకు ఏర్పాటైన శిబిరాలకు సర్వర్ సమస్యలతో ఇబ్బందులు వస్తున్నాయి. గ్రామ/వార్డు సచివాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 23వ తేదీన శిబిరాలు మొదలుపెట్టారు. 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రచారం లేకపోవడం, వెళ్లినా సర్వర్ సమస్యతో ఒక్కో శిబిరం వద్ద 20 మందిలోపు మాత్రమే వస్తున్నారు. దీంతో గడువు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్, ఆయా మండలాల ఎంపీడీవోలు వెల్లడించారు. సర్వర్, ఆధార్ కిట్ సమస్యలతో శిబిరాలు కొన్ని చోట్ల నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. శనివారం సత్తెనపల్లి పట్టణంలోని కంబాలబావి ఏరియా (4వ సచివాలయం)లో, సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం, వావిలాలనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, నందిగామ-1 సచివాలయంలో శిబిరాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు.



క్రిస్టియన్‌పేటలోని 5వ సచివాలయంలో వివరాలు అప్‌డేట్ చేయించుకుంటున్న యువకుడు

వాహన చోదకుల నిర్లక్ష్యం ప్రాణానికే ప్రమాదం

అమరావతి: వాహన చోదకులు నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకే ప్రమాదమని పారా లీగల్ వలంటీర్ జక్కుల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు యువతకు మోటారు వాహనాల చట్టం గురించి స్థానిక బస్టాండ్ వద్ద శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క వాహనదారుడు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని, ఎక్కువశాతం తలకు గాయం కావడం వల్లేనని గుర్తుచేశారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశంలో కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా కూడా ఇబ్బందులు తప్పవని తెలిపారు. ప్యానల్ న్యాయవాది బి.ఎల్. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అతి వేగం కారణంగా యువత రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై సర్వే

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై సర్వే కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జయకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శరీరంపై మచ్చలు ఏమైనా ఉన్నాయా అని సర్వే చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. దమ్మాలపాడు గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ ఆకస్మిక తనిఖీ



కారెంపూడి: జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆకస్మిక తనిఖీలలో భాగంగా కారెంపూడి మండల ప్రత్యేక అధికారి జి.జోసెఫ్ కుమార్ స్థానిక అంబేద్కర్ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. సెంటర్‌లో ఒక్కో చిన్నారికి ఇస్తున్న కిట్స్, పెడుతున్న భోజనం అలాగే తల్లులు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహార కిట్స్ వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అందరి నుంచి వివరాలు సేకరించారు. అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌కు ప్రహరీ గోడ లేదని, టాయిలెట్స్ లేవని స్పెషలాఫీసర్‌కు మాచర్ల సీడీపీవో సరళ వివరించారు. ప్రస్తుతానికి సెంటర్ పక్కనే మూత పడిన ఎలిమెంటరీ స్కూలు టాయిలెట్స్ వాడుకోవాలని ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రహరీ, టాయిలెట్స్ మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. అయితే చిన్నారులను ప్రాథమిక విద్యకు సిద్ధం చేసే కృత్యాలు శ్రద్ధతో నిర్వహించాలని ఈ దశలోనే విద్య పట్ల వారిలో చెరగని ముద్ర వేయడం సాధ్యమని దానిని నెరవేర్చే బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపై ఉందని ప్రత్యేక అధికారి జోసెఫ్ కుమార్ చెప్పారు.

కోటయ్య సేవలు మరువలేనివి



పిడుగురాళ్ల: స్వాతంత్య్ర సమరయోధులు ప్రగడ కోటయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని పద్మశాలి సంక్షేమ సంఘం, పద్మశాలి సంఘం ఎంప్లాయిస్ నాయకుల ఆధ్వర్యంలో కోటయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటయ్య స్వాతంత్య్ర పోరాటంలో చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు గోల్లి విశ్వేశ్వరరావు, గుర్రం శ్రీనివాసరావు, సాముల హనుమంతరావు, దామెర్ల పట్టాభి, గంజి నరసింహారావు, సూరే పల్లి కోటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన అవసరం

పెదకూరపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని మండల ప్రత్యేక అధికారి ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం పెదకూరపాడులోని 6వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ మున్ని తదితరులు ఆమె వెంట ఉన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, చౌటపాపాయపాలెం, బ్రాహ్మణపల్లి గ్రామాలలో వాడుకలో లేని బావులలో దోమలు పెరగకుండా గంబూషియా చేప పిల్లలను శుక్రవారం వదిలారు. ఈ చేపల ద్వారా దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏఎన్ఎంలు ప్రమీలారాణి, లక్ష్మీతిరుపతమ్మ, రాజ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, రాధ, నామాల ప్రసన్నలక్ష్మి, రెబ్బమ్మ, మద్దెమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాజుపాలెంలోని బావిలో గంబూషియా చేపలు వదులుతున్న సిబ్బంది

పాఠశాలకు స్థలం మంజూరుకు కృషి చేస్తాం



జెడ్పీ హైస్కూల్‌లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ శర్మ



రెంటాల జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

మండల ప్రత్యేక అధికారి టి.సత్యనారాయణ శర్మ

రెంటాల(రెంటచింతల): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంతో కాలంగా విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నూతన పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలం మంజూరుకు కృషి చేస్తామని జిల్లా భూగర్భ జలవనరుల అధికారి, మండల ప్రత్యేక అధికారి టి.సత్యనారాయణ శర్మ అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎంఈవో-2 వై.శివనాగేశ్వర రావులతో కలిసి మండలంలోని రెంటాల గ్రామంలో నున్న జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అలాగే ఉపాధ్యాయులు అందరూ ఉన్నారా.. తరగతి గదులు సరిపోతున్నాయా.. పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు ఉన్నాయా..అని హెచ్‌ఎం ఏవీ నాగవీరయ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ, ఇంగ్లిష్ బోధించుటకు ఉపాధ్యాయులు లేరన్నారు. తరగతి గదులు సరిపోవడం లేదని ఆట స్థలం కూడా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. గతంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కూడా మంజూరు అయ్యాయని.. స్థలం లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేకపోవడం జరిగిందని హెచ్‌ఎం మండల ప్రత్యేక అధికారికి వివరించారు. గ్రామ సమీపంలో నున్న దేవదాయ శాఖకు చెందిన 15 ఎకరాల భూమి ఉందని దానిలో సుమారు 5 ఎకరాలు పాఠశాలకు కేటాయించితే ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. వెంటనే ఆ భూమిని అధికారులు సందర్శించి పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ బి.అరుణ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ శర్మ తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆహారాన్ని అధికారులు తిని నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓర్సు సాగర్, గుజ్జుల లింగారెడ్డి, వి.సుబ్బారావు, ఎం.మల్లిఖార్జునరావు, ఆర్.బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

కార్గిల్ వీరులను స్మరించుకోవడం మన బాధ్యత



రెంటచింతల ఎంపీయూపీ పాఠశాలలో కార్గిల్ యుద్ధ వీరులకు నివాళి



కార్గిల్ అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

రెంటచింతల: దేశ సరిహద్దులో పాకిస్తాన్ ముష్కరులతో 85 రోజుల పాటు జరిగిన కార్గిల్ వార్‌లో అసువులు బాసిన కార్గిల్ వీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని డాక్టర్ ఎంటీ చిన్నమ్మ, హెచ్‌ఎం కె.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 1999 మే 3 నుంచి జూలై 26 వరకు జరిగిన కార్గిల్ యుద్ధంలో 537 మంది భారత సైన్యం అమరులయ్యారని గుర్తు చేశారు. ఈ యుద్ధంలో భారత సైన్యం పూర్తి విజయం సాధించి దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటారన్నారు. అనంతరం పాఠశాలలో అమరు వీరుల చిత్రానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ, ఉపాధ్యాయులు భీముడునాయక్, మండవ పుల్లారావు, సోమ్లా నాయక్, బిల్లా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి యువత పాత్ర కీలకం

మాచర్ల : కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరవీరులకు గుర్తుగా జరుపుకునే కార్గిల్ విజయ్ దివస్‌ను మాచర్ల పట్టణంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా ఆర్ఎస్ఎస్ నేత కన్నెగంటి కోటేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ సేవా సమితి నిర్వాహకులు ముదిరాజు బాబు శ్రీనివాసరావు, ఎం.రామోహన్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైనికుల స్ఫూర్తిని గుర్తుంచుకోవాలన్నారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత ప్రాధాన్యతపై వివరించారు. కార్గిల్ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూతలపాటి శివభాస్కర్, కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి, అధ్యాపకులు సయ్యద్ రబ్బాని, కాశి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

దాచేపల్లి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కె.కాంతారావు అన్నారు. డెంగీ మాసోత్సవాలలో భాగంగా ముత్యాలంపాడు చెరువులో, నడికుడి క్వారీ గుంతల్లో దోమల లార్వాలను నివారించటానికి గంబూషియా చేపలను శుక్రవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. చెరువులు, కుంటల్లో ఈ చేపలను విడిచిపెట్టటం వలన డెంగీ వంటి జ్వరాలను కలుగుజేసే దోమల లార్వా గుడ్లు నశిస్తాయన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌ల బారిన పడిన రోగులకు తక్షణ వైద్య సేవలు అందించాలని, అత్యవసర చికిత్స అవసరమైన వారిని నరసరావుపేట, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలకు తరలించాలని ఆయన సూచించారు. అనంతరం దాచేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక అధికారి వెంట డాక్టర్ కాశీ మధుసూదన్‌రావు, సర్పంచ్ నెమలికంటి వెంకటాచారి, ఆరోగ్య విస్తరణ అధికారి పట్టాభి, సీహెచ్‌వో కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు గోవిందమ్మ, సరస్వతి తదితరులున్నారు.



చెరువులో గంబూషియా చేపలను వదులుతున్న సిబ్బంది

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

రెంటచింతల: వర్షాకాలంలో విష జ్వరాలతో పాటు పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలోని పారిశుద్ధ్య పనులకు స్థానిక అధికారులు అధిక ప్రాధాన్యత నివ్వాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నా రు. శుక్రవారం ఆయన రెంటచింతలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన దోమలు ఉధృతంగా పెరగడంతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయా గ్రామాల అధికారులు వెంటనే పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో ఇళ్ల మధ్య, అంతర్గత రహదారులకు ఇరువైపుల మురుగునీరు లేకుండా చూడాలని, సైడ్ కాల్వలపై బ్లీచింగ్ చల్లేల చర్యలు చేపట్టాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది గ్రామాలలోని ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామాలలో క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టి, మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాలలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో పి.శంకర్‌రావు